క్లుప్తంగా

లయన్స్‌క్లబ్ టీం ఎన్నిక



ములుగు: ములుగు లయన్స్‌క్లబ్ టీంను జిల్లా కేంద్రంలో గురువారం ఎన్నుకున్నారు. అంతర్జాతీయ లయన్స్ క్లబ్ 320ఎఫ్ జిల్లా గవర్నర్ వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరు కాగా 2024–25 సంవత్సరానికి గాను చాటర్ నైట్ అధ్యక్షుడు డాక్టర్ రఘు ఆధ్వర్యంలో ములుగు లయన్స్ క్లబ్ నూతన జనరల్ బాడీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మేరుగు రమేష్, ప్రధాన కార్యదర్శిగా చుంచు రమేష్, కోశాధికారిగా సానికొమ్ము రవీందర్ రెడ్డి, ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్‌గా దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సెకండ్ వైస్ ప్రెసిడెంట్‌గా గండ్రకోట సుధీర్ ఎంపికయ్యారు. ములుగు క్లబ్ సభ్యులు అందరిని ముఖ్య అతిథి డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ వెంకటేశ్వరరావు సన్మానించారు. లయన్స్‌క్లబ్ తరుపు జ్ఞాపికను అందించారు.

వైద్యశిబిరం

కన్నాయిగూడెం: పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారి అభినవ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని బూపతిపూర్‌లో వైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహిచి మందులను అందజేశారు. అనంతరం మలేరియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు గురువారం పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల లైబ్రరీయన్ మురళీకృష్ణ, అధ్యాపకులు స్వాతి, అనిల్‌కుమార్, సదానందం, రాజు, రమేష్, నరేష్ పాల్గొన్నారు.

కరకట్ట నిర్మాణం చేపట్టాలి

మల్హర్: మండలంలోని చిన్నతూండ్ల శివారులోని ఆరెవాగుపై చేపట్టిన చెక్‌డ్యామ్ వద్ద కరకట్ట నిర్మాణం చేపట్టాలని రైతులు మిర్యాల రవీందర్‌రావు, మిర్యాల రవి, అచ్యూర్రావు, పులిగంటి బొందయ్య, బాపు, జంగ చిన్నమల్లమ్మ, ధనపునేని రాజేశ్వర్‌రావు అధికారులను కోరారు. కోతకు గురైన పొలాల వద్ద గురువారం వారు మాట్లాడుతూ.. ఆరె వాగు వద్ద నిర్మించిన చెక్ డ్యామ్ వల్ల గత ఏడాది ఉధృతమైన వరదతో పొలాల మీదుగా వరద పోయి ఇసుక మేటలు వేశాయన్నారు. దీంతో రూ.లక్షలు ఖర్చు చేసి భూములను సాగులోకి తీసుకోని వచ్చామని పేర్కొన్నారు. గతంలో కొంత వాగు మట్టి పోసిన వరదకు కొట్టుక పోయిందన్నారు. ఈ ఏడాది భారీ వర్షాలు కురిసి వరదలు వస్తే మరోసారి తీవ్రంగా నష్ట పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్‌కు చెప్పిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జిల్లా అధికారులు స్పందించి కరకట్ట నిర్మాణం చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

వానాకాలం సాగుకు సిద్ధం



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు



వ్యవసాయ పనుల్లో రైతులు

- దుక్కులు దున్నుతున్న రైతులు
- తొలకరి కోసం ఎదురు చూపులు

వెంకటాపురం(కె): రైతులు వానాకాలం సాగుకు సిద్ధమవుతున్నారు. మంచి వర్షాలు కురుస్తాయన్న ఆశతో సాగు చేసేందుకు ఏర్పాటు చేసుకుంటున్నారు. వ్యవసాయ అధికారులు సాగుకు అవసరమైన విత్తనాలు ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వెంకటాపురం మండలంలో మొత్తం సాగు పది వేల హెక్టర్లలో ఉంది. మండలంలో రైతులు ముఖ్యంగా వరి, మొక్కజొన్న, మినుము పంటలను ఎక్కువగా సాగు చేస్తారు. ఈ వానాకాలం రైతులు సాగు చేసే పంటల ప్రణాళికలను సైతం వ్యవసాయ అధికారులు తయారు చేసి ప్రభుత్వానికి పంపించారు. దీని ప్రకారం రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం మండలంలో రైతులకు కావాలసిన విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. అవసరాన్ని బట్టి అదనంగా కూడా విత్తనాలను తెప్పించేందుకు అధికారులు తగిన ఏర్పాట్లను చేస్తున్నారు.

వర్షం కోసం ఎదురుచూపు

వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో తొలకరి కురుస్తుందన్న ఆశతో అన్నదాతలు ఎదురు చూస్తున్నారు. దుక్కులు దున్నించి పంట పొలాల్లో ఎరువులు పోస్తు సమాయత్తం అయ్యారు. బావులు, బోర్ల కింద నీరు అందుబాటులో ఉన్న కొందరు రైతులు వరి నార్లను పోస్తున్నారు.

సమస్యలు ఎవరితో చర్చించాలి?

- అధికారులు రాకపోవడంతో సభను బహిష్కరించిన ఎంపీటీసీలు



సభ నుంచి వెళ్లిపోతున్న ఎంపీటీసీ సభ్యులు

వెంకటాపురం(ఎం): అధికారులు రానప్పుడు మండల సభను నిర్వహించడం ఎందుకంటూ ఎంపీటీసీ సభ్యులు మండల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించి సభనుంచి వెళ్లిపోయారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బుర్ర రజిత అధ్యక్షతన గురువారం మండల సభ నిర్వహించారు. మండల సభకు 25శాఖల అధికారులు హాజరుకావాల్సి ఉండగా కేవలం 8 శాఖలకు చెందిన అధికారులు మాత్రమే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రాజు అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. మండల సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని, ప్రతి శాఖ నుంచి ప్రగతి నివేదిక వారం రోజుల ముందే ఇవ్వాలని చెప్పినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. మండల సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారులతో పాటు ప్రగతి నివేదిక సమర్పించని అధికారులపై కలెక్టర్‌కు రిపోర్ట్ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మునిగంటి తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు జంగిలి శ్రీలత, పోశాల అనితలు మండల సభకు అధికారులు రానపుడు ప్రజల సమస్యలు ఎవరితో చర్చించాలని పేర్కొంటూ మండల సభను బహిష్కరిస్తున్నామని చెప్పి సమావేశం నుంచి వెళ్లిపోయారు. ఐదేళ్లుగా చెబుతున్న అధికారుల తీరు మారకపోవడం విడ్డూరంగా ఉందని, కలెక్టర్ స్పందించి మండల సభకు హాజరుకాని అధికారులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గై రుద్రమదేవి, ఎంపీటీసీ సభ్యులు బానోతు భాస్కర్, కందారపు మధుకర్, గోపు స్వప్న, జాహీర్‌పాషా, లక్ష్మి, ఆశోక్, మాడుగుల రమేష్, కుమారస్వామి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంత నిర్వహణకు వేలం



వేలంపాట మార్గదర్శకాలను వివరిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

ములుగు రూరల్: మండలంలోని జంగాపల్లి పంచాయతీ పరిధిలో సంత నిర్వహణకు గురువారం వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటలో రూ.22లక్షల 14 వేల ఆదాయం సమకూరిందని ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. పంచాయతీ కార్యాలయంలో వేలం పాటలు నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ఏప్రిల్ నెలలో నిర్వహించాల్సిన అంగడి వేలంపాట ఎన్నికల నేపథ్యంలో మూడు నెలల పాటు గతంలో టెండర్ దక్కించుకున్న వారికి అప్పగించి మూడు నెలలకు గాను పశువులకు రూ.2లక్షల 05 వేలు, గొర్లు,మేకలకు రూ.2లక్షల 48 వేలు, తైబజారు రూ.40 వేలకు అప్పగించామని అన్నారు. ప్రస్తుతం టెండర్‌లు తొమ్మిది నెలలకు మాత్రమే నిర్వహిస్తున్నామని తెలిపారు. టెండర్ దక్కించుకున్న వారు మొత్తం సొమ్మును ఏకకాలంలో చెల్లించాలని అన్నారు. లేని పక్షంలో డీడీ స్వాధీనం చేసుకొని రెండవ పాటదారుడికి అప్పగిస్తామని అన్నారు. పశువుల రహదారి, గొర్లు,మేకలు, తైబజారుకు వేలం పాటలు నిర్వహించగా, పశువుల రహదారి రూ.8లక్షల 20 వేలకు జక్కుల కుమారస్వామి, గొర్ల,మేకల రహదారి కోతి కృష్ణాగౌడ్ రూ.8లక్షల01 వేయి, తైబజారు కమలాకర్‌రావు రూ.1లక్ష 08 వేలకు దక్కించుకున్నారు. దీంతో గ్రామ పంచాయతీకి ఆదాయం రూ. 22లక్షల 14 వేలు సమకూరిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి రహిమోద్దీన్, జంగాలపల్లి పంచాయతీ కార్యదర్శి తిరుపతి, బంజరుపల్లి పంచాయతీ కార్యదర్శి రాజేష్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

బాల బాలికల్లో వ్యత్యాసం చూపొద్దు



అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం ప్రేమలత

ములుగు రూరల్: బాల బాలికల మధ్య వ్యత్యాసం చూపకూడదని పత్తిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రేమలత అన్నారు. గురువారం బాలరక్ష భారత్ ఫ్యూర్ ప్లే, విద్యాశాఖ సమన్వయంతో సేఫ్ బ్యాక్ టూ స్కూల్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. అందరూ చదవాలి అందరూ ఎదగాలని అన్నారు. పిల్లలందరిని పాఠశాలలో చేర్పించాలని వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని అన్నారు. బాల రక్ష భారత్ ప్రతినిధి తేజావత్ రవికుమార్, ఉపాధ్యాయుడు అంగోత్ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



మంగపేట: ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్యాధికారి నిఖిల్‌కుమార్



ఏటూరునాగారం: మాత్రలు వేస్తున్న వైద్యాధికారి సుమలత

మంగపేట: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలను గురువారం పంపణీ చేశారు. జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 20న మంగపేట, చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీల పరిధిలో 01 నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలకు మాత్రలు పంపిణీ చేయగా అప్పుడు మాత్రలు తీసుకోలేని పిల్లలను గుర్తించి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జగ్రత్తలపై సూచనలు చేశారు. పాటించాల్సిన ఆరోగ్య జాగ్రతలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారి నిఖిల్‌కుమార్, యమున, వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం

ఏటూరునాగారం: వ్యక్తిగత పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటామని రొయ్యూర్ వైద్యాధికారి సుమలత అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ మహిళా కళాశాలలో సికిల్‌సెల్, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. దగ్గు, జలుబు, జ్వరం వంటివి వస్తే వెంటనే ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందాలన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంకు సన్మానం



ఏఎన్‌ఎం ఉపేంద్రను సన్మానిస్తున్న రవిగౌడ్

ములుగు రూరల్: గిరిజన ప్రాంతంలో 18 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎం తాల్లూరి ఉపేంద్రను సోషల్ వర్కర్ గుండబోయిన రవిగౌడ్, వైద్య సిబ్బంది గురువారం సబ్ సెంటర్‌లో శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వాపూర్, అంకన్నగూడెం, జగ్గన్నగూడెం, లాలాయిగూడెం గిరిజన గ్రామాల ప్రజలను డెలివరీకి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లాలని సౌకర్యాలను వివరిస్తూ 100 శాతం కాన్పులు ప్రభుత్వ ఆస్పత్రిలో అయ్యేలా ఏఎన్‌ఎం కృషి చేస్తుందని అన్నారు. పది రోజుల క్రితం ఏఎన్‌ఎం తన కొడలి డెలివరీ ప్రభుత్వ ఆస్పత్రిలో చేయించి పలువురికి ఆదర్శంగా నిలిచిందని అన్నారు. ప్రైవేటు ఆస్పత్రిలో కాన్పుకు వెళ్లితే కుటుంబాలపై ఆర్థిక భారం పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రెండవ ఏఎన్‌ఎం అల్లెం సులోచన, ఆశాలు గుండబోయిన రమాదేవి, ధనలక్ష్మీ, మమత, ఈశ్వరి, సారలక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్ నర్సమ్మ, రాధ, సునీత, కొండక్కతో పాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ల మరమ్మతు



ఎండిపోయిన చెట్టును తొలగిస్తున్న సిబ్బంది



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

వాజేడు: విద్యుత్‌శాఖ సిబ్బంది గురువారం మండల కేంద్రంలో విద్యుత్ లైన్ల మరమ్మతు పనులను చేపట్టారు. కొన్ని చోట్ల ఒక లైనుపై నుంచి మరొక లైను వెళ్లడంతో అక్కడ కొత్తగా స్తంభాలను వేసి మరో దిశలో లైన్లను కలిపారు. విద్యుత్ స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా ఉన్న చోట కొత్త వాటిని వేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో ఎండిపోయిన చెట్టు ప్రమాదకరంగా ఉండటంతో అక్కడ విద్యుత్ వైర్లను తప్పించి ఎండిన చెట్టును తొలగించారు. తిరిగి విద్యుత్ లైన్లను ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో మండల కేంద్రంలో ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలను చేపట్టారు. కాగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయడంతో ప్రభుత్వ కార్యాలయాలతో పాటు వ్యాపారస్తులు, ప్రజలు కొంత ఇబ్బందులకు గురయ్యారు.

బాలలకు బైక్ ఇవ్వొద్దు

- ప్రమాదాల బారిన చిన్న పిల్లలు
- కొరవడిన తల్లిదండ్రుల పర్యవేక్షణ



టేకుమట్లలో బైక్ నడుపుతున్న బాలుడు



చిట్యాలలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న బాలుడితో మాట్లాడుతున్న సీఐ వేణుచందర్(ఫైల్)

టేకుమట్ల: చిన్న పిల్లలకు బైక్, కార్ డ్రైవింగ్ ఆనందంతో పాటు, ఉత్సాహాన్ని కలిగిస్తుంది. చిన్న వయస్సులో స్నేహితులతో కలిసి బైక్ రైడింగ్ చేస్తూ ఎంతో ఆనందాన్ని ఆస్వాదిస్తుంటారు. కానీ అదే సంతోషం ప్రమాదాల బారిన పడేందుకు సైతం అవకాశం ఉంటుంది. స్కూల్, కాలేజీ పిల్లలు సంతోషాలను ఆస్వాదిస్తూ బైక్ రైడింగ్ చేస్తూ ఎంతో మంది ప్రమాదాల బారిన పడి, ప్రాణాలను సైతం కోల్పోయి తల్లిదండ్రులకు కడుపుకోతను మిగిల్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

తల్లిదండ్రుల పర్యవేక్షణ ముఖ్యం..

చిన్న పిల్లలు బైక్ రైడింగ్ చేసే విషయంలో తల్లిదండ్రుల పర్యవేక్షణ కీలకంగా ఉంటుంది. పిల్లలపై పర్యవేక్షణ లేని మూలంగా ఎంతో మంది పిల్లలు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొంత మంది పిల్లల తల్లిదండ్రులు మాత్రం పిల్లల శారీరక, మానసిక స్థితిని గమనిస్తూ శిక్షణతో పిల్లలకు డ్రైవింగ్ నేర్పిస్తూ రోడ్డు భద్రతలపై అవగాహన కల్పిస్తున్నారు. దాంతో పిల్లల్లో నైపుణ్యంతో పాటు, విశ్వాసాన్ని పెంపొందించుకుంటూ జాగ్రత్తగా వాహనాలను నడుపగలరు.

మైనర్లు బైక్ నడుపుతూ ప్రమాదానికి గురైన సంఘటనలు

- టేకుమట్ల మండలంలోని ఆశిరెడ్డిపల్లి–పంగిడిపల్లి మలుపు వద్ద మూడేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడగా, రామకిష్టాపూర్(వి) గ్రామానికి ఇద్దరు మైనర్లు మృతి చెందారు.
- ఇటీవల టేకుమట్ల–ఆశిరెడ్డిపల్లి ప్రధాన రోడ్డులో ద్విచక్రవాహనంపై నుంచి పడి తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు.
- గర్మిళ్లపల్లి–ఒడేడ్ ప్రధాన రోడ్డు డబుల్ బెడ్రూం ఇళ్ల సమీపంలోని మూల మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నాదమ్ముళ్లు మృతి చెందారు. అందులో ఒకరు మైనర్.
- ఇటీవల గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన బాలుడు ద్విచక్ర వాహనంపై నుంచి పడి తీవ్ర గాయాలై ఆస్పత్రి పాలయ్యాడు.
- గత సంవత్సరం మండల కేంద్రానికి చెందిన బాలుడు ద్విచక్ర వాహనంతో మరొకరిని ఢీ కొట్టిన ఘటనలో వ్యక్తి గాయాలపాలైయ్యాడు.
- గత నెలలో అంకుషాపూర్‌లో మైనర్ బాలుడు ద్విచక్ర వాహనంపై మండల కేంద్రానికి అధికవేగంతో వస్తూ అదుపు తప్పి పడిపోగా తీవ్ర గాయాలపాలైనాడు.

పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దు



చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వడం వల్ల ఎంతో మంది ప్రమాదాల బారిన పడి ప్రాణాలు సైతం కోల్పోయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ప్రమాదాలు జరిగిన తర్వాత బాధపడడం కంటే ముందుగానే పిల్లలకు వాహనాలు ఇవ్వకుంటే మంచిది. చిన్న చిన్న పనులకు ఇతర ప్రదేశాలకు పిల్లలను పంపిస్తూ వాహనాలను ఇవ్వడం మూలంగా అనుకోని సంఘటనలు జరుగుతున్నారు. వయస్సు, అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని పిల్లలకు వాహనాలను ఇవ్వాలి.

-రమేశ్, పోతుగల్లు, మొగుళ్లపల్లి

అవగాహన కల్పిస్తున్నాం..



రోడ్డు భద్రతా నియమాలు ప్రతి ఒక్కరూ పాటించేలా మండలంలోని అన్ని గ్రామాల్లో నిరంతరం అవగాహన కల్పిస్తున్నాం. చిన్న పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలను ఇవ్వొద్దు. ఎక్కడైనా చిన్న పిల్లలు వాహనాలతో కలిపిస్తే వారి తల్లింద్రులతో మాట్లాడి అవగాహన కల్పిస్తున్నాం. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలి. నింబంధనలు అతిక్రమించిన వారికి జరిమానాలు సైతం విధిస్తున్నాం.

- గోగికారి ప్రసాద్, ఎస్సై, టేకుమట్ల

పరిమితికి మించి ఇసుక తరలిస్తే చర్యలు

మంగపేట: ఇసుక లారీల్లో పరిమితికి మించి ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై టీవీఆర్ సూరి హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు లారీ డ్రైవర్లు అత్యాశతో ఓవర్ లోడ్‌తో ఇసుకను తరలిస్తూ రోడ్డు ధ్వంసం చేస్తున్న లారీలపై స్టేషన్ పరిధిలో 15 కేసుల్లో 25 లారీలను సీజ్‌చేసి మైనింగ్ డిపార్ట్‌మెంటుకు అప్పగించడం జరిగిందన్నారు. మండలంలో ఇసుక క్వారీ నిర్వహకులు ప్రభుత్వ నిబంధనల మేరకు ఇసుకను లారీలలో లోడింగ్ చేయాలన్నారు. పరిమితికి మించి అదనంగా లోడింగ్ చేయొద్దని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



కాల్వలోకి దూసుకువెళ్లిన ఆటో

వెంకటాపురం(కె): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని నూగూరు గ్రామ సమీపంలోని వెదుళ్ల చెరువు సమీపంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపురం(కె) మండల కేంద్రం నుంచి వస్తున్న ఆటోను వాజేడు మండలం వైపు నుంచి వస్తున్న ఆటో ఎదురు ఎదురుగా ఢీ కొట్టడంతో ఆటోలు రోడ్డుపై పల్టీకొట్టి కాల్వలోకి దూసుకెళ్లాయి. కాగా, ఈ ప్రమాదంలో రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్‌కు సంపత్ తలకు గాయాలు కావడంతో వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు.

రుచి లేని భోజనం

ఎస్ఎస్‌తాడ్వాయి: సమ్మక్క–సారలమ్మ హుండీల కానుకల లెక్కింపును గురువారం మేడారంలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన సిబ్బందిని హుండీల లెక్కింపునకు తీసుకువచ్చారు. కాగా, వారికి నాణ్యమైన భోజనం తయారీ చేసి పెట్టకపోవడంతో సిబ్బంది అసహనం వ్యక్తం చేశారు. నాణ్యమైన భోజనం పెట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు వినిపించాయి. భోజనాల పేరు మీద వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని అధికారులు లెక్కలు చూపుతున్నారే తప్ప భోజనంలో నాణ్యత పాటించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. మేడారంలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్‌కు భోజన తయారీ బాధ్యతలను అప్పగించారు. ఆయన కూడా నిర్లక్ష్యంగా తయారీ చేయించాడని ఆరోపించారు. కోట్లాది ఆదాయం వస్తున్న మేడారం ఆదాయంలో అధికారులు నిర్లక్ష్యం చేయడం సరికాదని పూజారులు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో పశువుల మృతి



మల్హర్: విద్యుదాఘాతంతో నాలుగు జెర్సీ ఆవులు, ఒక ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని కొండంపేట గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని మధుసూదన్‌కు చెందిన పశువులు ఎడ్లపల్లి శివారులోని పొలాల్లో మేత మేస్తున్నాయి. ఈ క్రమంలో పొలాల్లో ప్రమాదవశాత్తు తెగి పడి ఉన్న విద్యుత్ తీగలను తాకి షాక్ గురై నాలుగు జెర్సీ ఆవులు, ఒక్క ఎద్దు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. వీటి విలువ రూ.5 లక్షలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.